జాతీయ ఉపకార వేతన పరీక్షకు హాల్‌టిక్కెట్లు జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల ఐదో తేదీన 2022-23 విద్యా సంవత్సర జాతీయ ఉపకార వేతన పరీక్షకు వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న సంచాలకుల వెబ్‌సైట్ www.bse.ap.gov.inను సంప్రదించాలని సూచించారు. వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వివరాలకు 9505678655 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఉపయోగం లేని ఉద్యోగోన్నతులు

- ఎస్‌జిటిలకు ఉపాధ్యాయుల నిరాసక్తత
- ఉన్న చోటనే కొనసాగేందుకు ఆసక్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా ఉన్న వారికి విద్యార్హతల ఆధారంగా సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లుగా వెళ్లేందుకు అయిష్టతను వ్యక్తపరుస్తున్నారు. ఎస్‌జిటిగా గుర్తింపుతో పాటు నెలకు రూ.2,500 అలవెన్సు ఇస్తామన్నా చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఆ గుర్తింపు, అలవెన్సులు తమకు వద్దంటూ నిరాసక్తత కనబరుస్తున్నారు. ఈ విషయం విద్యాశాఖలో చర్చగా మారింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉండడంతో గతేడాది అక్టోబరులో ఉద్యోగోన్నతులు పొందని వారితో కొన్ని భర్తీ చేశారు. మిగిలిన వాటిని భర్తీ చేసేందుకు సెకండరీ గ్రేడ్ టీచర్లలో సీనియార్టీ జాబితాను రూపొందించారు. వీరిని కౌన్సెలింగ్‌కు పిలవగా తాము ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లోనే కొనసాగుతామని స్పష్టం చేస్తున్నారు. ఉపయోగం లేని ఉద్యోగోన్నతులు వద్దని చెప్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చెప్పిందొకటి... చేసేదొకటి

సాధారణంగా ఉపాధ్యాయుల పోస్టులు, ఉద్యోగోన్నతులు 70 శాతం ఇన్ సర్వీసు నుంచి మిగిలిన 30 శాతం నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేస్తారు. విలీనం తర్వాత 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లు, సబ్జెక్టు ఉపాధ్యాయులతో చెప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. హేతుబద్ధీకరణ, విలీనం ద్వారా పెద్దఎత్తున మిగులు ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నట్లు చూపిస్తూ వారిని స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆచరణ మరోరకంగా ఉండడంతో ఉపాధ్యాయుల్లో నిరాసక్తత కనిపిస్తోంది. ప్రస్తుతం చేపడుతున్న సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అడహక్ ఉద్యోగోన్నతులు కాకుండా సర్దుబాటుతో ప్రస్తుతం జరుగుతున్న క్రతువుపై పెదవి విరుస్తున్నారు. రెండు ఇంక్రిమెంట్లతో పాటు హోదా మారే కౌన్సెలింగ్ నిర్వహించకుండా కేవలం రూ.2,500లు అలవెన్సు ఇస్తే దూరప్రాంతాలకు ఎలా వెళ్తామని ప్రశ్నిస్తున్నారు.

ఇతర జిల్లాల్లో మాదిరిగా మండలాల వారీగా ప్రక్రియ చేపట్టకుండా జిల్లాస్థాయిలో చేపడుతున్నారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న పలువురు సరిహద్దు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఉపాధ్యాయులకు ఇది మరింత తలనొప్పిగా మారింది. గుర్తింపు లేని, ఆర్థికంగా ఉపయోగం దక్కని పని సర్దుబాటుపై అంతగా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియకు చాలామంది ఉపాధ్యాయులు దూరంగా ఉంటున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

- 22,355 మంది హాజరు
- 1380 మంది గైర్హాజరు
- నిమిషం నిబంధనతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు

శ్రీకాకుళం : శ్రీ చైతన్య కాలేజీలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ రాత పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 23,735 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 22,355 మంది హాజరయ్యారు. 1380 మంది గైర్హాజరయ్యారు. రాత పరీక్ష కోసం శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం టౌన్, రూరల్, ఎచ్చెర్ల, పొందూరు... టెక్కలి రీజియన్ పరిధిలోని టెక్కలి, నరసన్నపేట, కాశీబుగ్గ, కోటబొమ్మాళి ప్రాంతాల్లో మొత్తం 72 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెక్కలి రీజియన్ పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో 10,375 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 9,732 మంది హాజరయ్యారు. 643 మంది గైర్హాజరయ్యారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని కేంద్రాల్లో 13,360 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 12,623 మంది హాజరయ్యారు. 737 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఒంటి గంటతో ముగిసింది. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావులేకుండా పటిష్టమైన పోలీస్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల్లో జిరాక్స్ షాపులను మూసివేశారు. ప్రతి కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు సిబ్బందితో పాటు అదనంగా రక్షక్ మొబైల్స్, రూట్ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్, డోర్ కమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు.

కోటబొమ్మాళి : ఆలస్యంగా రావడంతో అభ్యర్థిని తిప్పి పంపుతున్న పోలీసులు

పొందూరు : సిస్టమ్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

నిమిషం నిబంధనతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు

నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించలేదు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురానికి చెందిన జి.స్వాతి పరీక్షా కేంద్రం విషయంలో తికమక పడింది. కాశీబుగ్గ అక్షర కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉండగా, శ్రీకాకుళం అక్షర టెక్నో కళాశాలకు వెళ్లింది. అక్కడకు వెళ్లిన ఆమెకు కాశీబుగ్గ అక్షర కళాశాల అని అక్కడి సిబ్బంది చెప్పడంతో, శ్రీకాకుళం నుంచి కాశీబుగ్గ వెళ్లింది. ఈలోగా సమయం 10.30 గంటలు కావడంతో పరీక్ష రాసేందుకు అనుమతి నిరాకరించారు. పలాసలోని సూర్యతేజ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతి నిరాకరించారు. కోటబొమ్మాళిలోని విక్టరీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కానిస్టేబుల్ రాత పరీక్షకు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని పోలీసులు పరీక్ష రాసేందుకు నిరాకరించారు. దీంతో ఆ విద్యార్థి అసహనంతో వెనుదిరిగాడు.

పరీక్షా కేంద్రానికి పరుగున వస్తున్న అభ్యర్థి

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

శ్రీకాకుళం నగరం, పొందూరులోని పలు పరీక్షా కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించారు. టెక్కలిలోని పలు పరీక్షా కేంద్రాలను ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్ పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి అభినందనలు తెలిపారు.

సమాజాన్ని చైతన్యపరిచేది సాహిత్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ఉద్యమాలకు ఊపిరి : మంత్రి సీదిరి
- ముగిసిన ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు

ప్రజాశక్తి - పలాస

మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సమాజాన్ని చైతన్య పరిచేది సాహిత్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రాష్ట్రాల విభజన భాష, యాస, సాహిత్యంతోనే సాధ్యమయ్యాయని చెప్పారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉద్దానం సాహితీ సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు ఆదివారం రాత్రితో ముగిసాయి. ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ ప్రముఖ గాయకుడు గద్దర్ సాహిత్యం తెలంగాణ రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. వంగ పండు సాహిత్యం ఉద్దాన ప్రాంతాన్ని మైపరిపించిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో సాహిత్యం కీలక పాత్ర పోషించిందన్నారు. తమిళనాడులో తెలంగాణ, తెలుగు, తమిళం ఇలా అన్ని భాషల్లో పెద్ద గ్రంథాలయం ఉందని చెప్పారు. భాష, సాహిత్యానికి ఆ ప్రాంతంలో అంత ప్రాముఖ్యత ఇస్తున్నారని చెప్పారు. ఉద్దాన ప్రాంతంలో భాష, యాస, సాహిత్యంపై ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సాహిత్య వేదికను కోరారు. అందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. నిశబ్దం, మౌనం ఒక భాషేనని చెప్పారు. పక్షులు, జంతువులు, సముద్రం ఇలా వారివారి శబ్దాలు భాషగానే చెప్పాలన్నారు.

రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగు భాషకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఉద్యమాలకు చైతన్యం పరిచేది సాహిత్యమేనని, జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాలకు సాహిత్యం ఊపిరి పోసిందన్నారు. కవులు, రచయితల కోసం పలాసలో మహాసభలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి కళలు, కవులు, రచయితలు, కళాకారుల ద్వారానే చరిత్ర మునుగడ ఉంటుందని చెప్పారు. అందుకు ఎటువంటి ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ ప్రముఖ సినీగేయ రచయిత డాక్టర్ అందెశ్రీ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలని, కిడ్నీ బారినపడి ఎంతో మంది రోగులు మృత్యువాత పడుతున్నారని, అందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. పార్టీలకు అతీతంగా కిడ్నీ రోగులపై శ్రద్ధ చూపాలన్నారు. గత ప్రభుత్వాలు ఏం చేశాయో చూడకుండా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలని, ఈ విషయం తెలిసిన నాటి నుంచి ఎంతో ఆవేదన చెందుతున్నానని చెప్పారు. ముందుగా కళ్లేపల్లి స్వర్ణ లలిత, స్వరాజ్యం వెంకట రమణమ్మ రాసిన చంద్రలేఖ, పేజీలో పెన్నిధి పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆరు జిల్లాల నుంచి వచ్చిన కవులు, రచయితలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్, సీదిరిని ఘనంగా సన్మానించారు. తొలుత చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, ఎఎంసి ఛైర్మన్ పివి.సతీష్, జి.షణ్ముఖరావు, ఉద్దానం సాహిత్య సంస్కృతిక వేదిక అధ్యక్షులు లండన్ రుద్రమూర్తి, గౌరవ సలహాదారులు తెప్పల కృష్ణమూర్తి, కార్యనిర్వహక అధ్యక్షులు కుమార్ నాయక్, ఉపాధ్యక్షులు కుతం వినోద్, కార్యదర్శి శివ జ్యోతి, గౌరవ అధ్యక్షులు వంకల రాజారావు, బండారు కాలి దాసు, గంటిడి గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టం రద్దుకు కేంద్రం కుట్ర

- చట్టం పరిరక్షణకు నేడు నిరసన కార్యక్రమం
- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ధర్మారావు

ప్రజాశక్తి - మందస

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మారావు

1/70 చట్టం రద్దుకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కుట్ర జరుగుతోందని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ధర్మారావు విమర్శించారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణకు చెందిన సూరెడ్డి రమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్ దాఖలు చేసి, సుప్రీంకోర్టులో ఇన్‌ప్లీడ్ కావాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఇప్పుడు ఐదో షెడ్యూల్ వైపు దృష్టిసారించిందని విమర్శించారు. ఇప్పటికే ఐదో షెడ్యూల్‌లో ప్రయోజనం పొందుతున్న స్థానిక గిరిజనులకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ జిఒ నంబరు 3ను సుప్రీంకోర్టులో బిజెపి సానుభూతిపరుడైన సుప్రీంకోర్టు న్యాయవాది మిశ్రా ద్వారా రద్దు చేయించిందని తెలిపారు. నేడు 1/70 చట్టాన్నీ అదే ప్రక్రియలో రద్దు చేయించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి సహకరించేందుకు తెలంగాణకు చెందిన రమణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గిరిజన ప్రాంతంలో భూమి, ఉద్యోగం, ఖనిజ సంపదను దోచుకోవడం కోసం 1/70 చట్టం ఆటంకంగా ఉందని, దీన్ని రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఇప్పటికే గిరిజన సంఘం (టిఎసి) తీర్మానం ప్రకారంగా సుప్రీంకోర్టులో దాఖలైన జిఒ నంబరు 3పై రివ్యూ పిటిషన్ నేటికీ విచారణ పూర్తి చేయలేదని తెలిపారు. ఐదో షెడ్యూల్ క్లాజ్ టూ ప్రకారంగా చట్టబద్ధత కల్పిస్తామని టిఎసిలో తీర్మానం చేసి, న్యాయ సలహా పేరుతో అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసి రెండేళ్లవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించకపోవడంతో గిరిజన ప్రాంతంలో యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే ప్రతిపాదనను హైకోర్టు తిరస్కరించిందని తెలిపారు. రాజకీయ ప్రయోజనం కోసం ప్రభుత్వం రెండోసారి ఏక సభ్య కమిషన్ శ్యామల ఆనంద్‌ను నియమిస్తూ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. 1/70 చట్టం పరిరక్షణ కోసం ఈనెల 24వ తేదీన మందసలో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. గిరిజన సంఘం నాయకులు బి.ఢిల్లీరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్.గురునాథం, ఎస్.బృందావనం, వై.భాస్కరరావు, శివ, అర్జున్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో పూతకు ప్రమాదం

- మామిడి, జీడిమామిడి పూత దశ కీలకం
- జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వజ్రపుకొత్తూరు పరిసరాల్లో కనిపిస్తున్న మామిడి, జీడిమామిడి పూత

అత్యధిక వాణిజ్య విలువలు, ఆదాయ వనరులు సమకూర్చే పంటల్లో మామిడి, జీడి మామిడి ప్రధానమైనవి. జిల్లాలో మామిడి కన్నా జీడిమామిడి ఎక్కువగా సాగవుతోంది. మామిడి కన్నా జీడిమామిడికి మార్కెట్ సదుపాయం ఉండడంతో ఎక్కువగా దానిపైనే జిల్లా రైతులు ఆధారపడుతున్నారు. ఈ పంటలు అధిక దిగుబడులు ఇవ్వాలంటే పూత దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని 30 మండలాల్లో 51 వేల ఎకరాల్లో జీడిమామిడి, ఐదు వేల ఎకరాల్లో మామిడి సాగవుతున్నాయి. పూత దశలో జీడిమామిడి, మామిడి దిగుబడులను పెంచుకునేందుకు, లాభాలను ఆర్జించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ వివరించారు.

(ఇన్‌సెట్) శ్రీకాకుళం జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్

శీతాకాలంలో పూతకు వచ్చే మామిడిపై వాతావరణం, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, దట్టమైన పొగమంచు ప్రభావం అధికంగా ఉంటుంది. దీంతో పూత వచ్చినా ముడుచుకునిపోయి దిగుబడి భారీగా తగ్గిపోయే ప్రభావం ఉంది. నాఫ్తలిన్ అసిటిక్ ఆమ్లాన్ని (ప్లానో ఫిక్స్) నీటిలో కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. దీనివల్ల పూత పూర్తిగా విచ్చుకుని పిందెలు కట్టే అవకాశం ఉంది. ఏమాత్రం అవకాశం ఉన్నా పూత దశలో మామిడి చెట్లకు నీటి తడులు ఇస్తే పూత నిలబడి అధిక దిగుబడులు సాధించవచ్చు.

జీడిమామిడిపై...

జీడిమామిడిలో పూత మూడుసార్లు వస్తుంది. మొదటి విడతలో నవంబర్-డిసెంబర్ మధ్యలో, జనవరి-ఫిబ్రవరిలో మరోసారి, మార్చిలో పూత వస్తుంది. ప్రధానంగా జనవరి-ఫిబ్రవరిలో వచ్చే పూత పైనే రైతులు దృష్టిసారించి, పూతను సంరక్షించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్ల మందు, కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాముల లీటరు నీటికి కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. జనవరి-ఫిబ్రవరిలో లామ్డాసైహాలోత్రిన్ 0.6 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మూడోదఫా ప్రొఫెనోఫాస్ మందు పిచికారీ చేయాల్సి ఉంటుంది. కాయ దశలో నల్లని మచ్చలు వచ్చేందుకు కారణమయ్యే తామర పురుగులు, రసం పీల్చే పురుగుల నివారణకు లామ్డాసైహాలోత్రిన్, కాన్ఫిడార్, ఫిప్రోనిల్ మందుల్లో ఒక దాన్ని పిచికారీ చేయాలి. కాయదశలో నీటి తడులు మంచి దిగుబడిని ఇస్తాయి.

రథసప్తమికి వివిపిలకు ప్రత్యేక పాసులు

25 నుంచి దాతలకు పాసుల జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చెక్కులను అందజేస్తున్న దాతలు

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 28న నిర్వహించే రథసప్తమి వేడుకలకు విఐపిలకు రూ.500 టిక్కెట్‌తో ప్రత్యేకంగా పాసులను ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు ఆలయన కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ పాసులను అరసవల్లిలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద రూ.500 చెల్లించి పొందవచ్చని చెప్పారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతి అనుమతి పత్రం పొందిన వారికి మాత్రమే ఈ పాసులను అందజేస్తారని స్పష్టం చేశారు. ఒక్కో విఐపి టిక్కెట్‌తో ఇద్దరికి మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదని తెలిపారు.

25 నుంచి దాతలకు పాసుల జారీ

అరసవల్లి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న దాతలకు ఈనెల 25, 26, 27న పాసులను ఆలయ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ లోపు రూ.లక్ష వరకు విరాళాలు ఇచ్చిన వారి నుంచి స్వీకరించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి ఇంతవరకు ఆలయం విరాళాలు ఇచ్చిన దాతలకు ఆలయ సిబ్బంది ద్వారా ఫోన్‌లో దాతల పాసులకు సంబంధించిన వివరాలను తెలియజేస్తామన్నారు. ఈమేరకు నేరుగా దాతలు గానీ, వారి అనుమతితో వచ్చిన సంబంధికులకు మాత్రమే దాతల పాసులను అందజేస్తామని స్పష్టం చేశారు.

విఐపిల సందర్శన

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం పలువురు విఐపిలు సందర్శించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంతోష్ మెహరా, ఇతర అధికారులు సందర్శించారు.

దాతల విరాళం

అరసవల్లి ఆలయానికి పెద్దపాడుకు చెందిన వారణాసి తవిటిరాజు, రాజేశ్వరి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన మామిడి శంకరరావు, ఉష దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.1,00,016 విరాళాన్ని అందజేశారు. ఆలయ ఇఒ హరి సూర్యప్రకాష్ చెక్కులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారం మారితేనే అభివృద్ధి

- పోస్టర్లతో ప్రజల్లో అవగాహన కల్పిస్తాం
- ఉత్తరాంధ్ర వెనుకబాటుపై మాట్లాడే నైతికత ధర్మానకు లేదు
- రాష్ట్రం బాగు కోసమే పాదయాత్ర చేశాం
- అమరావతి జెఎసి కో కన్వీనర్ జి.తిరుపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అధికారం మారితేనే అభివృద్ధి సాధ్యమని అమరావతి జెఎసి కో కన్వీనర్ జి.తిరుపతిరావు అభిప్రాయపడ్డారు. ఇదే అంశాన్ని ప్రజలకు వివరించడానికి రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లతో విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ అమరావతి జెఎసి ఆధ్వర్యాన రైతులు చేపట్టిన అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్ర ఆదివారంతో ముగిసింది. గతేడాది పాదయాత్ర ఆగిపోయిన చోట నుంచి ఈనెల 11న అమరావతి జెఎసి కో కన్వీనర్ గద్దె తిరుపతిరావు కాలినడకన అరసవల్లికి బయలుదేరారు. శనివారం రాత్రికి శ్రీకాకుళం చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి దర్శనానికి బయలుదేరారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి వరకు ఆయన వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఇతర నాయకులు వెళ్లారు. సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని పాదయాత్రను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలకు ఎన్నో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని చెప్పారు. పోలీసు శాఖను తమ సొంత అవసరాలకు వాడుకుంటూ ప్రశ్నించిన వారిపై నిర్బంధం, అక్రమ కేసులను బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై మాట్లాడే నైతిక హక్కు మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణకు లేదదన్నారు. సుదీర్ఘకాలం పాటు మంత్రులుగా పనిచేసిన వారు సొంత ఆస్తులను కూడబెట్టుకున్నారు తప్ప ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం బాగు కోసమే అమరావతి రైతులు పాదయాత్ర చేశారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొండు శంకర్, సింతు సుధాకర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొర్ను నాగార్జున ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లికి పాదయాత్రగా వస్తున్న తిరుపతిరావు, టిడిపి నాయకులు

బారువ విద్యార్థుల ప్రతిభ

గ్రిగ్స్ పోటీల్లో రజత పతకాలు కైవసం

పతకాలు సాధించిన శ్రీధర్, దిలీప్, కృష్ణ

ప్రజాశక్తి- సోంపేట

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ గ్రిగ్స్ పోటీల్లో బారువకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తాచాటారు. రజిత పతకాలు సాధించి, ఔరా అనిపించారు. బారువకు చెందిన టి.శ్రీధర్ అండర్-17 విభాగం హేమర్ త్రోలో రజితం, యాదవ్ దిలీప్ అండర్-14 విభాగంలో వంద మీటర్ల రిలేలో రజితం, అండర్-19 విభాగం షాట్‌పుట్‌లోబడే కృష్ణ రజిత పతకాలు సాధించినట్లు కోచ్ బి.మారుతి తెలిపారు. వీరికి ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్‌తోపాటు ఎస్ఎస్ఎ కబడ్డీ సభ్యులు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

రేపట్నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో ఈనెల 24, 25 తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ చక్రధర యువజన సంఘం సభ్యులు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని చక్రధర యువజన సంఘం సభ్యులు ఆదివారం విడుదల చేశారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతిగా రూ.11,001లు, రూ.8001లు, తతీయ, చతుర్ధ స్థానాలకు రూ.5001, రూ.3001లు నగదు బహుమతులతో పాటు అత్యుత్తమ ప్రతిభ చూపినవారికి వ్యక్తిగత బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నెంబర్లకు 9207945029, 9603819654 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ స్వామి, చక్రధర యువజన సంఘం సభ్యులు పి.కృష్ణారావు, శ్రీ చక్రధర యువజన సంఘం అధ్యక్షుడు పొందల మురళీధర్, పి.జానకి రామయ్య, జి.ప్రశాంత్, ఎస్.సుధాకరరావు, ఎస్పి ప్రవీణ్, మదన్, విజయరామరాజు, మనోజ్, తేజేశ్వరరావు, రామమూర్తి, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను అభినందిస్తున్న వాకర్స్

సుధాకర్‌కు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : అంతర్జాతీయ నడక పోటీల్లో అనేక పతకాలు సాధించిన నగరానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సంజీవిని నళిని సుధాకర్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేయాలని తీర్మానించారు. శ్రీలంక దేశంలోని కొలంబో నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన 36వ అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడక విభాగంలో ద్వితీయ స్థానం సాదించిన సుధాకర్‌ను నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంస్థలు చీఫ్ కో-ఆర్డినేటర్ పి.జి.గుప్తా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపు తెచ్చిన నళినీ సుధాకర్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు గుర్తించి తగు గౌరవాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి నెలలో ఒడిశా రాష్ట్రం బరంపురంలో నిర్వహించనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశాల్లో సుధాకర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటిస్తామని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పేరు ప్రఖ్యాతులు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేస్తున్న నళిని సుధాకర్ సేవలు జిల్లా యంత్రాంగం గుర్తించిందన్నారు. ఆయన స్ఫూర్తితో మరింత మంది ఉత్తమ వాకర్స్‌ను తయారు చేసేందుకు ప్రతినెలా నడక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ సంస్థలు మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కూన వెంకటరమణ మూర్తి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దకోటలో 'ఎంజిఆర్' పర్యటన

పర్యటిస్తున్న గోవిందరావు

ఎల్ఎన్‌పేట : మండలం పెద్దకోటలో టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావును టిడిపి సీనియర్ నాయకుడు, ఎఎంసి మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు ఆదివారం గజమాల వేసి స్వాగతించారు. గోవిందరావు లాంటి నాయకుడు నియోజకవర్గానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం కోటదుర్గమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో గోవిందరావు పాల్గొన్నారు.

సొంత ఇంట్లోనే స్వయం ఉపాధి

- కొండచీపుర్ల తయారీతో ఆర్థిక స్వావలంబన
- ఆదర్శంగా సీతానగరం మహిళలు
- ప్రోత్సహిస్తే మరింత వృద్ధి

చీపుర్లు కడుతున్న మహిళలు

సంతబొమ్మాళి మండలం సీతానగరం మహిళలు ఖాళీ సమయాన్ని వథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి దగ్గర కొండ చీపుర్ల తయారీని నేర్చుకున్న ఆ మహిళలు సొంతిట్లోనే వీటిని తయారు చేసుకుంటూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకొని స్వశక్తిపై జీవిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తూ ... మగవారికి ఏ మాత్రం తీసిపోని ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.. ఆ మహిళల ఆదర్శ జీవనంపై "ప్రజాశక్తి" ప్రత్యేక కథనం.

ఆర్థిక స్వావలంబన దిశగా మగువల అడుగులు

స్వయం సహాయక సంఘాల రుణాలు, స్త్రీ నిధి రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన దిశగా పలువురు మగువలు అడుగులు వేస్తున్నారు. గ్రామంలో 280 కుటుంబాలు ఉండగా ప్రస్తుతం 70కుపైగా కుటుంబాల మహిళలు చేతివృత్తిలా నిత్యం పని చేస్తుంటారు. ఒక చీపురు ధర రూ.100 నుంచి 150 వరకు పలుకుతుంది. రోజుకు ఐదు నుండి పది చీపుర్లు సులువుగా కట్టి ఖర్చులు పోను రూ.800 పైబడి సంపాదిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 100 మందికిపైగా చీపుర్లు తయారు చేస్తున్న మహిళలు ఉన్నారు. వీరు తయారు చేసిన చీపుర్లు మంచి ఆకర్షణగా, నాణ్యతగా ఉండడంతో బయట మార్కెట్లో మంచి గిరాకీ ఏర్పడింది. వీటిని మన జిల్లాతో పాటు, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేస్తుంటారు.

ఒకరితో మొదలై.. ఊరంతా..

సీతానగరం గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి పన్నెండేళ్ల కిందట బతుకుతెరువు కోసం అండమాన్ వలస వెళ్లింది. అక్కడ ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాల్లో తిరిగి ఒక కుటీర పరిశ్రమలో మూడు నెలలపాటు చీపుర్ల తయారీ నేర్చుకుంది. అనంతరం స్వగ్రామానికి తిరిగివచ్చి చీపుర్లతోనే జీవనాధారం పొందాలనుకుంది. తన భర్త సోమేశ్వరరావు ప్రోత్సాహంతో సొంత గ్రామంలోనే దీనిని చిన్న కుటీర పరిశ్రమగా ప్రారంభించింది. మొద ట్లో కాస్త పెట్టుబడి పెట్టి శ్రీముఖ లింగం, మెళియాపుట్టి ప్రాంతాల నుండి వీటికి కావాల్సిన కుంచె, నార, తాడును తెచ్చి చీపుర్లు కట్టేది. అది చూసిన చుట్టుపక్క మహిళలు ఆసక్తితో ఆమె ఇంటికి వెళ్లి, ఆమెతో పాటు పని చేస్తూ చీపుర్లు కట్టడం నేర్చుకున్నారు. అనతికాలంలోనే ఆ చీపుర్లుకు మంచి గిరాకీ లభించడంతో ఈ కుటీర పరిశ్రమ ఎంతో మందికి జీవనాధారంగా మారింది.

ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి

సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం పెట్టుబడి పెట్టాల్సిన పరిశ్రమ కాబట్టి బయట నుంచి అప్పులు తెస్తే ఆర్థిక భారం అవుతుంది. కనుక ఈ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించి మహిళా సంఘాలు, స్త్రీనిధి రుణాలను అవసరమైనపుడు సమయానికి అందించడం ద్వారా ఈ పరిశ్రమకు మరింత సహకారం అందించవచ్చు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వైఎస్ఆర్ చేయూతతో ఇప్పటికే పలువురు మహిళలకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. డ్వాక్రా సంఘాల ద్వారా తయారైన ఉత్పత్తులను ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. తద్వారా ఈ పరిశ్రమతో మరింత మందికి ఉపాధి కలిగి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు.

మహిళలు పుట్టింటి నుంచి తీసుకురాని వస్తువు చీపురు... అదే చీపురు వారికి అత్తింటిలో ఉపాధినిస్తుంది... తాము ఉపాధి పొందుతూ... మరి కొందరికి ఉపాధినిస్తూ... స్వయంగా కొండచీపుర్లు తయారు చేసుకుం టూ.. ప్రగతిపథంలో దూసుకుపోతున్నారు.

- ప్రజాశక్తి, నౌపడ

ఆసక్తి ఉంటే నేర్పిస్తాం

అండమాన్‌లో ఒక కుటీర పరిశ్రమలో చీపర్లు తయారీ నేర్చుకున్నాను. మా గ్రామంలో 100 మంది వరకు చీపుర్లు కట్టడం నేర్పించాను. ఇంటి వద్దనే ఉంటూ రోజు వారి ఆదాయం సంపాదించుకుంటున్నాను. ఆసక్తిగా ఉన్న మహిళలను ప్రోత్సహించి నేర్పిస్తున్నాను. ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే చీపురు కట్టడం నేర్పిస్తాను. అవసరమైన ముడిసరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో పెట్టుబడి గతం కంటే ఎక్కువ అయింది. సత్వరం సమయానికి రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలి.

- బత్సల ధనలక్ష్మి, సీతానగరం

తక్షణ రుణం మంజూరు

సీతానగరంలో చీపుర్లు కడుతున్న మహిళలను పొదుపు సంఘాలు, స్త్రీ నిధి ద్వారా తక్షణ రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్నాం. కుటీర పరిశ్రమలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిని అర్హులైన మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గతంలో రెండు పర్యాయాలు శ్రీకాకుళం లో జరిగిన డ్వాక్రా బజారుకు మండలం నుంచి మహిళలు వెళ్లి చీపుర్లు అమ్మడం జరిగింది.

- ఎం.సూర్యనారాయణ, వెలుగు ఎపిఎం, సంతబొమ్మాళి

కేన్సర్‌పై అవగాహన అవసరం

జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటరమణ

అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి - హిరమండలం

కేన్సర్‌పై అందరికీ అవగాహన అవసరమని మాస్ మీడియా జిల్లా అధికారి వెంకటరమణ అన్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి సూచనల మేరకు హిరమండలం పిహెచ్‌సి, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఆవరణల్లో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం లాంటి పద్ధతులు అలవర్చుకోవాలని తెలియజేశారు. వైద్యాధికారులు, సిబ్బంది అందరూ కేన్సర్‌పై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అన్ని ప్రభుతాస్పత్రుల్లో, ప్రముఖ ప్రదేశాల వద్ద ముదురు నీలం, ఆకుపచ్చ రంగు బ్యానర్లు, పోస్టర్లు అంటించి ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఏర్పాటు చేశా రు. కార్యక్రమంలో డాక్టర్ సాయి గీత, డాక్టర్ మహ్మద్, సిహెచ్ఒ నారాయణరావు, పిహెచ్ఎన్‌లు, హెచ్‌విలు, ఎఎన్ఎంలు ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అపరాలకు మంచు దెబ్బ

మంచుకు మాడిపోయిన పెసర పంట

వజ్రపుకొత్తూరు: అన్నదాతలను మంచు కృంగదీస్తోంది. వంశధార శివారు ప్రాంతానికి ఖరీఫ్ సీజన్ నిరాశను మిగిల్చింది. సకాలంలో వర్షాలు లేకపోవడం, వంశధార నీరు అందకపోవడం వెరసి వరి పంట వేసుకున్న రైతులను నిలువునా ముంచింది. మూడేళ్లుగా ఇవే పరిస్థితులను అన్నదాతలు ఎదుర్కొం టున్నారు. ఈ నష్టాన్ని అపరాల ద్వారా పూడ్చుకుందామనుకున్న రైతును దట్టంగా కురుస్తున్న మంచు నిరాశ పర్చింది. రైతులు రెండో పంటగా మినుము, పెసర వేసుకున్నారు. మొక్కలు పూత దశకు చేరుకున్న సమయంలో గత రెండు వారాలుగా మంచు కురుస్తోంది. దీంతో పెసర, మినుము మొక్కలు మాడిపోతున్నాయి. పూత దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలు రోజురోజుకూ చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విత్తనాలకు అయిన ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

9 మందికి గాయాలు

ప్రజాశక్తి- వీరఘట్టం/కోటబొమ్మాళి

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం తూడి గ్రామ సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం ఎరకయ్యపేటకు చెందిన అల్లు బోయిన మల్లేష్ (40) మృతి చెందగా, మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వీరఘట్టం పోలీసుల కథనం మేరకు... కోటబొమ్మాళి మండలం ఎరకయ్యపేటలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు స్వగ్రామం నుంచి ఆదివారం రాయగడలోని మజ్జి గౌరమ్మ దర్శనానికి టాటా మ్యాజిక్‌పై వెళ్లారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వీరఘట్టం మండలం తూడి గ్రామ వద్దకు వచ్చేసరికి వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో పక్కనున్న చెట్టుకు ఢీకొంది. ఈ సంఘటనలో వాహనంలో ఉన్న మల్లేష్ రోడ్డుపైకి ఎగిరి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. మల్లేష్‌తో పాటు మరో 9 మంది గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను పాలకొండ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మల్లేష్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మిగతా క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించినట్లు వీరఘట్టం ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో విషాద ఛాయలు అలముకున్నాయి.

దర్యాప్తు చేస్తున్న డిఎస్‌పి విజయ్ కుమార్

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

ప్రజాశక్తి- పోలాకి

అట్రాసిటీ కేసుపై మండలంలోని బెలమర గ్రామంలో డిఎస్‌పి విజయ్‌కుమార్ ఆదివారం దర్యాప్తు చేపట్టారు. బెలమరలో ఎస్‌సి మహిళలపై దాడి చేసి, గాయపరిచారని గొర్లె సత్యంపై ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న సెల్‌ఫోన్ల దొంగలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో సెల్‌ఫోన్ల దొంగతనాలు రెచ్చిపోతున్నారు. ఆరు నెలలుగా ప్రతినెలా రెండు, మూడు దొంగతనాలతో రెచ్చిపోతూ... బైకుపై పరారవుతున్నారు. తాజాగా ఆదివారం ఆర్‌టిసి డ్రైవర్‌కు చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మందుల షాపులో మందులు కొనుగోలు చేడానికి వెళ్లారు. అదే సమయంలో బైక్‌పై పడిపోతున్నట్లు నటిస్తూ సహాయం చేయడానికి వ్యక్తి వద్ద నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసి అదే వాహనంలో పరారయ్యాడు. పోలీసులు సెల్‌ఫోన్ల దొంగలపై నిఘా పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

200 మందికి వైద్య పరీక్షలు

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవళాపురంలో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పొగ మంచు కురుస్తున్న సందర్భంగా జలుబు, దగ్గు, జ్వరాలు వస్తాయని, అలాగే బిపి, సుగర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ప్రత్యేక ఆహ్వానితులుగా గోవిందరావు

గోవిందరావు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులుగా బాడాన గోవిందరావును నియమిస్తూ ఎపి విజయవాడ దార్మిక పరిషత్, దేవాదాయశాఖ, ధర్మదాయశాఖ ఉత్తర్వులు జారీ చేశారని కొత్తమ్మతల్లి దేవస్థానం ఇఒ వై.సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. గోవిందరావు పదవి కాలం ధర్మకర్తల మండలి ట్రస్టు బోర్డు పదవి కాలం వరకు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో దేవాలయం అభివృద్ధికి రెండోసారి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించి ఉత్తర్వులు ఇచ్చినందుకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, దంత సర్పంచ్ ప్రతినిధి గొండు మురళికి గోవిందరావు ధన్యవాదాలు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

మాజీ మంత్రి గౌతు శివాజీ

కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న శివాజీ, బాబూరావు

పలాస: ఉద్దానం మంచి నీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడిన 24 నెలలుగా వేతనం చెల్లించాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ డిమాండ్ చేశారు. మందస మండలం మకరజోల ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ నెలలు కొద్ది వేతనాలు చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తాయని ప్రశ్నించారు. 143 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు టిడిపి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, బావన దుర్యోధన, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, తమ్మినేని గంగారాం, రాజశేఖర్, తామాడ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రీయ విద్యాలయంలో పెయింటింగ్ పోటీలు

శంకరయ్య, ప్రిన్సిపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యార్థుల సృజనాత్మక, వ్యక్తీకరణలను ప్రోత్సహించడానికి ఈ నెల 23న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.శంకరయ్య తెలిపారు. ఈ మేరకు విద్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు, వారిలో దేశభక్తి నింపేందుకు 'పరాక్రమ దివస్'గా పాటిస్తున్నామని అన్నారు. అదే సమయంలో విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడిని ఎదుర్కోవడానికి ప్రత్యేక చొరవతో పెయింటింగ్ పోటీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీలో వంద మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. స్థూలంగా జిల్లాలోని స్టేట్ బోర్డ్ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయ ఇలా పది స్కూళ్ల నుంచి పదేసి మంది విద్యార్థులు చొప్పున ఈ పోటీలో పాల్గొంటారని చెప్పారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర సమర యోధుల పుస్తకాలు, ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, పరిష్కరించాలని రైతు కూలీ సంఘం మండల కన్వీనరు జన్నెల ప్రసాదరావు కోరారు. ఆదివారం పట్టణంలోని రైతులతో జరిగిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ధాన్యం సేకరణలో మిల్లర్లు బాధ్యతా యుతంగా వ్యవహరించడం లేదని చెప్పారు. ఒడిశా-ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిత్లీ తుపాను సమయంలో బాహుదా నదిలో ఏర్పడిన ఇసుక మేటను తొలగించాలని అన్నారు. సమావేశంలో ఆసి చిరంజీవి రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, పి.దేవేంద్ర, కె.శంకరరెడ్డి, కూర్మారావు, డి.విశ్వనాథ్‌రెడ్డి, దేవరాజు సాహు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చిన్నబడాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. 1981-82 పదో తరగతి పూర్వ విద్యార్థులు మధుర జ్ఞాపకాలు, చిన్ననాటి స్మృతులు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

బహుమతులను అందజేస్తున్న శ్రీనివాసరావు

లావేరు: మురపాక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు వేమన శతకాలు ఆలపించి నీతి కథలు చెప్పారు. పి.రాధకు ప్రథమ బహుమతి, డి.సురేష్‌కు ద్వితీయ బహుమతి, కావ్యకు తృతీయ బహుమతులు వచ్చాయి. గ్రంథాలయం తరపున విజేతలకు గ్రంథాలయాధికారి మరపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకు లు జి.షణ్ముఖరావు, పాఠకులు, ధరావత్తుదారులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ల పదవీకాలం

పొడిగింపుపై హర్షం

ఇచ్ఛాపురం: బిసి కార్పొరేషన్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. కార్పొరేషన్ చైర్మన్‌గా తనను కొనసాగిస్తూ ఉత్తర్వులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. నాపై విశ్వాసంతో మరోసారి అవకాశం కల్పించిన సిఎం, నాయకులు విజయసాయిరెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, స్పీకర్ సీతారాం, పిరియా విజయ, సాయిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు లఖందిడ్డిలో గడప గడపకు

కోటబొమ్మాళి: మండలంలోని లఖందిడ్డి పంచాయతీలో సోమవారం నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అభిమానులు పాల్గొవాలని కోరారు.

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయిన బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన మల్లార్పు మోహనరావుకు మాతృమూర్తి యువజన సంఘం అండగా నిలిచింది. పొట్టకూటి కోసం భువనేశ్వర్ వెళ్లిన మోహనరావు తిరిగి వస్తుండగా రైలు ప్రమాదానికి గురయ్యాడు. కాళ్లు కోల్పోవడంతో ఉపాధి లేక కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న కుసుంపురం మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు ఆదివారం మోహనరావు నివాసానికి చేరుకుని రూ.4,500 నగదు, అన్నపూర్ణ అమృత హస్తం పేరిట నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు నాగు, కార్యదర్శి సురేష్, రామకష్ణ, రమేశ్, కేశవరావు పాల్గొన్నారు.

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కేన్సర్ రోగికి...

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీకి చెందిన కాయల ఖాళిదాసు కొంతకాలంగా గెయింట్ సెల్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆ విషయాన్ని తెలుసుకున్న సరుబుజ్జిలి మండలానికి చెందిన రేపటి ప్రయోజనం ఫౌండేషన్ సంస్థ రూ.పది వేలు ఆర్థికసాయం ప్రకటించింది. దీనిని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు బాధితుడికి ఆదివారం అందజేశారు. బాధితుడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసైనికులు భార్గవ్, లంకలపల్లి సురేష్, రమేష్, పైడి మురళీమోహన్, సతీష్, గణేష్, మణి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



బూర్జ : నగదును అందజేస్తున్న నాయకులు

ఆమదాలవలస : చెక్కును అందజేస్తున్న రామ్మోహనరావు

బూర్జ : నిరుపేదలకు నిస్సహాయకులకు జనసేన పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జనసేన పార్టీ నాయకులు కొల్ల జయరాం మౌలీలు అన్నారు. మండలంలోని సింగన్నపాలెంలో రామినాయుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు మృతుడి భార్య లక్ష్మికి రూ.24 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కిల్లాన నరేష్, సిక్కులు తిరుపతి, విక్రమ్, తులాగాపు తిరుపతి, రుద్ర జోగినాయుడు, భాస్కర్, ప్రదీప్, రాజేంద్ర పాల్గొన్నారు.